క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు జరిపారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా పైడితల్లి మారువారం పండగ



పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని భక్తులు, గ్రామస్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. విశేష హారతులు అందించారు.

ఏవోగా రమాదేవి బాధ్యతల స్వీకరణ




పరవాడ: మండల వ్యవసాయ అధికారి (ఏవో)గా మొల్లి రమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం డివిజన్ కార్యాలయంలో ఏవోగా పనిచేసి, సాధారణ బదిలీల్లో భాగంగా పరవాడ ఏవోగా నియమితులయ్యారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన సీహెచ్ చంద్రావతి పెందుర్తి మండల ఏవోగా బదిలీ అయ్యారు. ప్రభుత్వం పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని తనను కలిసిన విలేకరులకు ఈ సందర్భంగా రమాదేవి తెలిపారు.

సబ్బవరం మండల పరిషత్ సమావేశం రేపు

సబ్బవరం: సబ్బవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19(గురువారం)న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో గురువారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల పరిధిలోని అభివృద్ధి పనుల ప్రగతి, పాలనాపరమైన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



దుర్గాప్రసాద్

పెందుర్తి: స్థానిక దొగ్గవానిపాలెం కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన ధనాల రాంప్రసాద్(42) వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 6న రాత్రి 9 గంటల సమయంలో హైదరాబాద్‌లోని తన తమ్ముడు ధనాల శ్రీను ఇంటికి వెళతా.. అని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉంది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

అర్ధంతరంగా.. అగ్రి ల్యాబ్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు 90 శాతం పూర్తయిన జిల్లా అగ్రిల్యాబ్ పనులు అర్ధంతంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రూ.40 లక్షల నిధుల విడుదలకు చొరవ చూపకపోవడంతో రూ.6 కోట్ల ప్రాజెక్టు ప్రారంభానికి నోచుకోని పరిస్థితి నెలకొంది. ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే సబ్బవరం చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు, అనకాపల్లి జిల్లాలోని రైతన్నలకు ఎంతో మేలు జరిగేది.

- అందుబాటులోకి రాని జిల్లా స్థాయి అగ్రిల్యాబ్
- రూ.6 కోట్లు నాబార్డ్ నిధులతో నిర్మాణం
- గత ప్రభుత్వంలో 90 శాతంపైగా పనుల పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిన పనులు

5 ఎకరాల్లో.. రూ.6 కోట్లతో..

జిల్లా స్థాయి అగ్రిల్యాబ్ కోసం సబ్బవరంలోని సర్వే నెం.271లో 5 ఎకరాలు కేటాయించారు. సుమారు రూ.6 కోట్ల నాబార్డ్ నిధులతో చేపట్టే ఈ ల్యాబ్ కోసం రూ.3.5 కోట్లతో 14 గదులతో కూడిన భవన నిర్మాణాలను పోలీస్ హౌసింగ్ బోర్డు చేపట్టింది. మిగిలిన రూ.2.5 కోట్లతో అవసరమైన పరికరాలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు నిర్ణయించారు. ల్యాబ్‌కు కేటాయించిన స్థలంలో కొంతమంది ఆక్రమణదారులు ఉండటంతో కాంట్రాక్టర్‌కు స్థలం అప్పగించడంలో జాప్యం జరిగింది. దీని వల్లే గత ప్రభుత్వంలో సకాలంలో ల్యాబ్ అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. నిర్మాణాల పూర్తికి మరో రూ.40 లక్షలు కావాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తికావస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.



దోర్లు ఏర్పాటు చేసి తుది మెరుగులు చేపట్టకుండా వదిలేసిన భవనం

సబ్బవరం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సేవలన్నీ అందుబాటులోకి తెచ్చింది. పెట్టుబడి సాయం, రాయితీ ఎరువులు, విత్తనాలు, మద్దతు ధర తదితర అన్ని విధాలా రైతుకు అండగా నిలిచింది. అందులో భాగంగానే రైతన్నలు పంట సాగుకు ముందు భూసార పరీక్షలు, విత్తన, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు తదితరాల కోసం సబ్బవరంలో జిల్లా అగ్రి ల్యాబ్ ఏర్పాటుకు సంకల్పించింది. 90 శాతం పనులు పూర్తయిన దశలో ప్రభుత్వం మారడంతో అగ్రిల్యాబ్ సేవలు అందుబాటులోకి రాకుండానే అర్ధంతరంగా నిలిచాయి.

అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు

ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, మట్టి నమూనాలను పరీక్షించి, నివేదికలు త్వరితగతిన అందుకునే వీలుండేది. జిల్లా స్థాయి ల్యాబ్‌లో 12 మంది ఏవోలు, 24 మంది ఏఈవోలకు ఉద్యోగావకాశాలు దక్కేవి. వీరి సాయంతో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యతతోపాటు, మట్టి నమూనాలను ఉచితంగానే పరీక్షించి, ఏ భూమి ఏ పంటకు అనుకూలం, విత్తనాలు చల్లక ముందే వాటి నాణ్యత తెలుసుకోవడం ద్వారా నష్ట భయం నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ సేవలన్నీ ఉచితం కావడంతో ప్రతి రైతు పంటకు ముందే జాగ్రత్త పడేందుకు వీలుండేది. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బారిన పడే అగత్యం తప్పుతుంది. ల్యాబ్ అందుబాటులోకి రాకపోవడంతో అంచనా సేద్యంతో రైతులు ఎంతో కొంత నష్టపోతున్నారు.



తుది పనులకు నోచుకోని జిల్లా అగ్రిల్యాబ్ భవనం



తుప్పలు, దొంకలతో అధ్వానంగా మారిన అగ్రిల్యాబ్ ఆవరణం

రైతుల కష్టాలు తీర్చేందుకు..

పంటలో సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులతో పాటు భూసార పరీక్షలకు అవసరమైన ల్యాబ్ వసతి గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని జేడీ కార్యాలయంలో ఉండేది. భూసార పరీక్షలు నిర్వహించి రైతులు తమ భూములు ఏ పంటలకు అనుకూలంగా ఉన్నాయో తెలుసుకోవాలంటే విశాఖతోపాటు, నర్సీపట్నంలోని భూసార పరీక్ష కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది. సిబ్బంది కొరత, దూరాభారం కారణంగా చాలా మంది రైతులు ఆ దిశగా ప్రయత్నించేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సేవల్ని చేరువ చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక సమీకృత వ్యవసాయ ప్రయోగశాల ఏర్పాటు దిశగా ప్రతిపాదించారు. జిల్లా మొత్తానికి సబ్బవరంలో ల్యాబ్‌కు శ్రీకారం చుట్టారు.

అందుబాటులోకి వస్తే మేలు



వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలైన బొప్పాయి, కాలీఫ్లవర్, టమాటా, ఉల్లి, ఆరటి వంటివి సుమారు 7 ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఇందులో కొంత సొంతం. మిగిలినది కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా. భూసార పరీక్షలు, కల్తీలేని ఎరువులు, విత్తనాల నిర్ధారణకు ఎవరెవరినో ఆశ్రయించాల్సి వస్తోంది. సబ్బవరం అగ్రిల్యాబ్ అందుబాటులోకి వస్తే మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– చీపురబల్లి బంగార్రాజు, అమృతపురం గ్రామం

నిధులిస్తే అందుబాటులోకి..



జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్ నిర్మాణ పనులు 90 శాతం వరకూ పూర్తయ్యాయి. మరో రూ.40 లక్షల నిధులు కావాల్సి ఉంది. ఆ నిధులు విడుదల కాకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. భవన నిర్మాణం తుది దశకు రావడంతో మౌలిక వసతుల కల్పన, ల్యాబ్‌కు అవసరమైన పరికరాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే అందుబాటులోకి తీసుకొస్తాం.

– బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి, అనకాపల్లి

ముమ్మరంగా యోగా సాధన



యోగాసనాలు వేస్తున్న దేవస్థానం వేద విద్యార్థులు



యోగా సాధనలో దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు

సింహాచలం: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో 5 లక్షల మందితో జరిగే యోగా మహోత్సవంలో పాల్గొనేందుకు సింహాచలం దేవస్థానంలో మంగళవారం యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు, వేద విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన శిక్షకుల పర్యవేక్షణలో పలు యోగాసనాలు వేశారు. ఒక్కో ఆసనం వేయిస్తూ, దాని వల్ల కలిగే ప్రయోజనాలను, యోగా విశిష్టతను శిక్షకులు వివరించారు.

నేడు 500 మందితో సాధన

సింహాచలం కొండపై సుమారు 500 మందితో యోగాసనాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. 21న నగరంలో జరిగే యోగాసనాల కార్యక్రమంలో పాల్గొనేందుకు దేవస్థానం సిబ్బందికి 15 రోజుల ముందునుంచే శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు సింహగిరిపై రాజగోపురం ఎదురుగా ఉన్న మా డవీధిలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వేద పాఠశాల, సంస్కృతోన్నతపాఠశాల విద్యార్థులతో యోగాసనాల కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



అభివృద్ధికి నోచుకొని గంగునాయుడుపాలెం రోడ్డు

పరవాడ: మండలంలోనినాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం-గంగునాయుడుపాలెం గ్రామానికి వెళ్లే రహదారి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక, అనేక ఇబ్బందులు పడుతున్నామని ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వెంకటపతిపాలెం నుంచి కొంత మేర సీసీ రోడ్డు నిర్మించి, మిగిలిన రహదారిని వదిలేశారు. ఏ మాత్రం చిన్న వర్షం కురిసినా.. మట్టి రోడ్డు బురదమయంగా మారి, రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా వేయాలని అధికారుల్ని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించట్లేదని వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు కూండ్రపు కృష్ణంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించలేదన్నారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిలో వీధి దీపాల్లేకపోవడంతో రాత్రుళ్లు భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని చెప్తున్నారు. అసంపూర్తిగా నిలిచిన గంగునాయుడుపాలెం మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

51సార్లు హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణలో సింహగిరి వర్తకులు, మారుతి భక్తమండలి బృందం

సింహాచలం: చందనోత్సవం రోజు సింహగిరిపై గోడ కూలి శివైక్యం చెందిన భక్తుల పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో 51 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం జరిగింది. మెట్లమార్గాన్ని ఆనుకునే షాపింగ్ కాంప్లెక్స్ ఉండటంతో వర్తకులంతా సంఘటనను మరచిపోలేకపోతున్నారు. వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతీ భక్తమండలి బృందం 51 సార్లు హనుమాన్ చాలీసాని పఠించారు. ఈ సందర్భంగా ముగ్గు కిరణ్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ ఎగువన గోడ కూలి భక్తులు మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, వర్తకులు దొంతల శంకర్, నమ్మి శివ, చంద్రరావు, ఎస్.శివ, కె.సుజాత, శ్యామ్, అశోక్, పండూరి రమేష్ పాల్గొన్నారు.

చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



తల్లికి చిన్నారిని అప్పగించిన పోలీసులు

పెందుర్తి: భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం కారణంగా కోపంతో రెండేళ్ల చిన్నారిని బలవంతంగా తీసుకుపోయిన తండ్రి నుంచి విడిపించి, చిన్నారిని తిరిగి తల్లి వద్దకు చేర్చారు పెందుర్తి పోలీసులు. వివరాలివి.. వేపగుంట సమీపంలోని సింహపురికాలనీకి చెందిన కొంచాడ ఉపేంద్ర, లత దంపతులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి గొడవ జరిగింది. కోపంలో తమ రెండేళ్ల చిన్నారిని ఉపేంద్ర ఇంటి నుంచి తీసుకుని వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన లత వెంటనే పెందుర్తి పోలీసులను ఆశ్రయించింది. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఉపేంద్ర ఒడిశాలోని రాయగఢ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు అక్కడకు వెళ్లి ఉపేంద్రను అదుపులోకి తీసుకుని, చిన్నారిని తల్లికి అప్పగించారు. ఉపేంద్రకు కౌన్సెలింగ్ నిర్వహించి భార్యాభర్తల మధ్య స్పర్థలు తొలగేలా ప్రయత్నిస్తామని సీఐ వెల్లడించారు.

కూటమి ఏడాది పాలన.. అంతా మోసమే!

'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అదీప్‌రాజ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: గత ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం'పుస్తకాన్ని పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు 180 హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాది పాలనలో అభివృద్ధిని పక్కన పెట్టి మోసాలు, ఆరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడానికే సమయాన్ని వెచ్చిస్తోందన్నారు. ఏడాది పాలన అంతా విధ్వంసమేనని పేర్కొన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారనడానికి 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం'పుస్తకమే నిదర్శనమన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను ఏ విధంగా వెన్నుపోటు పొడిచారో ఈ పుస్తకంలో వివరించినట్టు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఎన్ని మడత పేచీలు పెడతారో చూడాలన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే అందించి చేతులు దులిపేసుకున్నారని ఆక్షేపించారు. గతేడాది ప్రజలకు అందించాల్సిన రెండు సిలిండర్లను ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.1,500 హామీ కూడా గాలికి వదిలేశారన్నారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నల సన్యాసిరావు, సర్పంచ్‌లు వెన్నల అప్పారావు, బొండా కనకారావు, కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, గొర్లి గోపిఅమ్మలు, యువజన విభాగం అధ్యక్షుడు బండారు శ్రావణ్‌కుమార్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈదలపాక సన్యాసిరావు, నాయకులు కావలి రాజు, పైల సత్తిబాబు, కావలి వాసు, మడక సూరిబాబు, డెక్క శ్రీనివాసరావు, కూండ్రపు కృష్ణం నాయుడు, కూండ్రపు ఉమా పాల్గొన్నారు.

'చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అందించాలి'



మాట్లాడుతున్న సత్యనారాయణ

పరవాడ: చిరుద్యోగులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ(సిటు) జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నెలకు రూ.25 వేల లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అతి తక్కువ ఆదాయం వస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్లు, పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు అన్న నెపంతో తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన ధరలతో రూ.25 వేల ఆదాయం ఉన్నవారి జీవనం ఎలా ఉందో కాస్తైనా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇలాంటి చిరుద్యోగుల్ని ప్రభుత్వ ఉద్యోగుల పేరిట సంక్షేమ పథకాలకు దూరం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవ పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకుని వీరికి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న సిటు జిల్లా కార్యదర్శి జగన్

పెందుర్తి: దేశంలో, రాష్ట్రంలో కార్మికుల హక్కులను ఎన్డీయే కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని సిటు జిల్లా కార్యదర్శి బి.జగన్ ఆరోపించారు. కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పెందుర్తి అర్బన్/గ్రామీణ ప్రాంత ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైన నేపథ్యంలో ఈ సమ్మెను తలపెట్టామన్నారు. అనంతరం పెందుర్తి ప్రాంత యూపీహెచ్‌సీ సిటు అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.రమణమ్మ, షేక్ అజ్జి బీబీలను, చినముషిడివాడ యూపీహెచ్‌సీ అధ్యక్ష, కార్యదర్శులుగా సత్య, గంగ, ముత్యమాంబ కాలనీ యూపీహెచ్‌సీ అధ్యక్ష, కార్యదర్శులుగా మహాలక్ష్మి, భారతిలను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

ఉక్కునగరం: కేవీపీఎస్ స్టీల్ డివిజన్, ఏపీ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఎస్టీఎం విభాగం జీఎం ఎస్.రమణారావు, జనరల్ ఫోర్‌మెన్ కె.బాలశౌరిలను సత్కరించారు. గత నెలాఖరున పదవీ విరమణ చేసిన సందర్భంగా స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారికి శాలువాలు కప్పి అభినందించారు. వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పని చేయాలని కోరారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ తమకు ఎంతో మంచి భవిష్యత్తు ఇచ్చిందని, ప్లాంట్ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ సుందరం, కేవీపీఎస్ అధ్యక్షుడు ప్రకాశ్ వరకుమార్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. చిరంజీవి, వై.టి. దాస్, బి. తాడన్న, కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ విమల తదితరులు పాల్గొన్నారు.

97వ వార్డులో రోడ్ల అభివృద్ధికి కృషి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వసంత శంకర్రావు

పెందుర్తి: వార్డులో రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు అన్నారు. చినముషిడివాడ సమీపంలోని ద్రోణంరాజునగర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.23 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, పలువురు అధికారులు, నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.